భారత్‌లో పారిశ్రామిక విప్లవం

ప్రణాళిక యుగం ఆరంభం నాటికి ఎంతో వెనుకబడిన దేశ పారిశ్రామిక రంగం... నాలుగు దశాబ్దాల్లో అనూహ్య ప్రగతి సాధించింది. సిమెంట్ రంగంలో ప్రపంచంలో రెండో స్థానాన్ని, స్టీల్ ఉత్పత్తిలో ఐదో స్థానాన్ని సొంతం చేసుకుంది. అభివృద్ధి చెందుతున్న దేశాలతో పోల్చితే శరవేగంగా అభివృద్ధి బాట పడుతోంది. దీనికి తోడు ప్రభుత్వాలు చేపడుతున్న 'ప్రత్యేక ఆర్థిక మండళ్ల' ఫలితంగా సమీప భవిష్యత్తులో విశేష ప్రగతి సుసాధ్యం!!

దాదాపు రెండున్నర శతాబ్దాల బ్రిటన్ వలస పాలకుల చేతుల్లో భారత వర్తక వాణిజ్యాలు కుదేలయ్యాయి. ముఖ్యంగా బ్రిటన్‌లో 1805లో మొదలైన పారిశ్రామిక విప్లవం ఫలితంగా అక్కడి వస్తువులకు... వలసదేశం భారత్ ప్రధాన మార్కెట్‌గా నిలిచింది. భారత్‌లోని హస్తకళాకృతులకు ప్రత్యామ్నాయంగా బ్రిటన్ నుంచి అనేక వస్తువులు దిగుమతయ్యేవి. ఈ క్రమంలో.. విదేశాల్లో యంత్రాల ఆధారంగా ఉత్పత్తి అయ్యే టెక్స్‌టైల్స్ నుంచి పోటీ తట్టుకోలేక దేశంలో హస్తకళల పరిశ్రమలు అంతరించాయి. దీనికితోడు బ్రిటన్ ప్రభుత్వం తమ దేశంలో తయారీ వస్తువుల దిగుమతులను, ముడి పదార్థాల ఎగుమతులను ప్రోత్స హించింది. దీంతో దేశంలో ప్రణాళికల రూప కల్పన సమయానికి పారిశ్రామిక రంగంలో అల్ప మూలధనం, మధ్య తరహా పరిశ్రమల్లో పరిమిత అభివృద్ధి, వినియోగ, మూలధన వస్తు పరిశ్రమల మధ్య సమతుల్యత కొరవడటం వంటి సమస్యలు తలెత్తాయి.

1951 నాటికి ఇనుము, ఉక్కు రంగంలో రెండు భారీ పరిశ్రమలు మాత్రమే ఉండేవి. అప్పటికి ద్విచక్ర వాహనాలు, రసాయనిక ఎరువులు వంటి రంగాల్లో పరిశ్రమలు లేనప్పటికీ ప్రస్తుతం ఎంతో స్వయంసమృద్ధి నమోదైంది. ఇదేబాటలో చక్కెర, సిమెంటు, విద్యుత్, బాయిలర్లు తదితర వినియోగ వస్తువుల ఉత్పత్తి ముందుకెళుతోంది. మైనింగ్, బొగ్గు, ఇనుప ఖనిజం, బాక్సైట్ రంగాల్లో గణనీయ ప్రగతి సాధ్యమైంది. జాతీయాదాయం (జీడీపీ)లో ద్వితీయ రంగ వాటా 1950-51లో 16.1 శాతం కాగా.. అది 2004-05లో 26.3 శాతానికి పెరిగి 2006-07లో 19.6శాతానికి తగ్గింది. ఆర్థిక సంస్కరణల ద్వారా ప్రభుత్వం పారిశ్రామిక రంగంలో అనేక సంస్కరణలు చేపట్టింది. అయితే ఆ సమయంలోనే పారిశ్రామి కాభివృద్ధి తగ్గడం గమనార్హం. 1991 తర్వాత ఈ రంగంలో ప్రభుత్వరంగ పెట్టుబడులు తగ్గడం, తయారీరంగం, వ్యవసాయ రంగ వృద్ధి క్షీణించడం దీనికి ప్రధాన కారణాలు. 1951-55 మధ్యకాలంలో 5.7 శాతం ఉన్న పారిశ్రామికరంగ సగటు వృద్ధి 1997-98 నుంచి 2001-02 మధ్యకాలంలో కేవలం



ఐదు శాతం మాత్రమే నమోదైంది. అనూహ్యంగా 2006-07లో అది 11.6 శాతానికి పెరిగింది. ఈ రంగంలో ఆధునికీకరణ లక్ష్యంగా... పారిశ్రామికీకరణను వేగంగా సాధించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అనేక ప్రోత్సాహక పథకాలను ప్రకటించింది. ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించి తద్వారా ఉపాధి అవకాశాలు పెంచాలనే ఉద్దేశంతో 'ప్రత్యేక ఆర్థిక మండళ్ల' ఏర్పాటును ప్రోత్సహిస్తోంది. ఫలితంగా పారిశ్రామిక వాణిజ్యం పెరిగి, ఆర్థికాభివృద్ధి సాధనకు మార్గం సుగమమవుతుంది.

పారిశ్రామిక వాణిజ్యం

ప్రణాళికల ప్రారంభం నాటికి పారిశ్రామికీకరణ జరగలేదు. దీంతో పారిశ్రామిక ఉత్పత్తులకు మన ఎగుమతుల్లో ప్రాధాన్యం లేదు. ఆ తర్వాత కాలంలో చేపట్టిన అనేక చర్యల వల్ల 1970-71 నుంచి ఇప్పటి వరకు తయారీరంగ ఎగుమతుల్లో విశేష పురోగతి కనిపిస్తోంది. 1970-71లో మొత్తం ఎగుమతుల్లో 50.3 శాతం ఉన్న పారిశ్రామిక ఉత్పత్తుల వాటా.. క్రమేపీ పెరిగింది. ఎగుమతులు 2002-03లో 70.6 శాతానికి, 2000-01 నాటికి 78.8 శాతానికి చేరాయి. 2006-07లో 68.6 శాతానికి తగ్గాయి. 2007 -08 ఏప్రిల్-సెప్టెంబర్ మధ్యకాలంలో మొత్తం ఎగుమతుల్లో వీటి వాటా 67.4 శాతం. ఎగుమతుల్లో ప్రధానమైనవి టెక్స్‌టైల్స్, రెడీమేడ్ గార్మెంట్స్, వజ్రాలు, ఆభరణాలు, ఇంజినీరింగ్ వస్తువులు, రసాయనాలు-సంబంధింత ఉత్పత్తులు, తోలు ఉత్పత్తులు, చేతివృత్తులు. 2006-07లో తయారీ ఉత్పత్తుల ఎగు మతి ద్వారా రూ. 3,92,447 కోట్ల రాబడి వచ్చింది. వీటిలో వజ్రాలు, ఆభరణాల ద్వారా రూ. 72,295 కోట్లు, టెక్స్‌టైల్స్, రెడీమేడ్ ఉత్పత్తుల నుంచి 59,327 కోట్లు.. రసాయనాలు, సంబంధింత ఉత్పత్తులతో రూ. 64,307 కోట్లు లభించాయి. టెక్స్‌టైల్స్, రెడీమేడ్ గార్మెంట్స్ వాటా మొత్తం ఎగుమతుల్లో 2000-01లో 23.6%. అది 2006-07 నాటికి 12.5% తగ్గింది. ఈ కాలంలో ఇంజినీరింగ్ వస్తువుల వాటా 15.7% నుంచి 23.3 శాతానికి పెరగ్గా... వజ్రాలు, ఆభరణాల వాటా 16.6 శాతం నుంచి 12.6%కు తగ్గింది. రసాయనాలు-సంబంధిత ఉత్పత్తుల వాటా 10.4 నుంచి 11.2 శాతానికి పెరిగింది. 2006-07లో ఎగుమతుల్లో వృద్ధి 22.6 శాతం. దీనికి కారణం పెట్రోలియం ఉత్పత్తులు 59.3 శాతం, ఇంజినీరింగ్ వస్తువులు 38.1% ఉత్పత్తి వృద్ధి

సాధించడమే. ఇంజినీరింగ్ వస్తువుల వాటా పెరుగుదల భారీ వస్తూత్పత్తుల పురోగమనాన్ని తెలియజేస్తోంది.

దిగుమతులు...

దిగుమతులకు సంబంధించి మూలధన వస్తువులు(ఎలక్ట్రానిక్ యంత్రాలు, రవాణా వస్తువులు, ప్రాజెక్ట్ వస్తువులు, ఎలక్ట్రిక్ యంత్రాలు) మొత్తం దిగుమతుల్లో 1974-95 మధ్యకాలంలో 26.5 శాతం వాటా కలిగున్నాయి. అవి 1995-96లో 27.8 శాతానికి పెరిగి, 2006-07లో 15.4 శాతానికి తగ్గాయి. 2006-07లో మొత్తం మూలధన వస్తువుల దిగుమతుల విలువ రూ. 1,29,631 కోట్లు. దిగుమతుల్లో 1974-95 మధ్య కాలంలో 5.7 శాతం ఉన్న ముత్యాలు, విలువైన రాళ్ల వాటా 2000-01లో 9.6 శాతానికి పెరిగి, 2006-07లో 4 శాతానికి తగ్గింది. ఎగుమతుల్లో వజ్రాలు, ఆభరణాల వాటా తగ్గడమే ఇందుకు కారణం. రవాణా వస్తువుల వాటా మొత్తం దిగుమతుల్లో 2000-01లో 1.4 శాతం, కాగా 2006-07లో 5.1 శాతానికి పెరిగింది. ఎలక్ట్రికల్, నాన్-ఎలక్ట్రికల్ యంత్రాల దిగుమతుల ఫలితంగా మూలధన వస్తువుల దిగుమతుల్లో వృద్ధి పెరిగింది. 2007-08 ప్రథమార్ధంలో ఇనుము ఉక్కు, రవాణా పరికరాలు తదితర దిగుమతుల్లో వృద్ధి పెరగడం తయారీరంగ అధిక వృద్ధిని సూచిస్తోంది.

2006-07లో అమెరికా, యూరోపియన్‌లకు ఎగుమతైన తయారీ ఉత్పత్తుల వృద్ధిలో తగ్గుదల కనిపిస్తోంది. అమెరికాకు ఎగుమతి చేసిన టెక్స్‌టైల్స్, తోళ్లు, తోళ్ల ఉత్పత్తులు, హ్యాండీక్రాఫ్ట్‌లు తగ్గాయి. టెక్స్‌టైల్స్ రంగంలో మొత్తం ప్రపంచ ఎగుమతుల్లో భారత్ వాటా 2004లో 3 శాతం, కాగా అది 2005లో 3.7 శాతానికి పెరిగి, 2006లో 3.7 శాతం వద్ద నిలకడగా ఉంది. ఎగుమతుల వృద్ధి 2005లో 29.6 శాతం నుంచి 2006లో 10.5 శాతానికి తగ్గింది. ముఖ్యమైన దిగుమతి దార్ల నుంచి డిమాండ్ తగ్గడం, అమెరికా డాలర్ విలువ క్షీణించి రూపాయి విలువ పెరగడం.. ఇతర పోటీదేశాలతో పోల్చినపుడు విద్యుత్ వ్యయం 1.5 నుంచి 2 రెట్లు అధికంగా ఉండటం... ఫలితంగా ఉత్పత్తి వ్యయంలో పెరుగుదల... చిన్న తరహా యూనిట్లు అధునాతన యంత్రాలు సమకూర్చు కోలేకపోవడం ఇందుకు కారణం. 2006-07లో అమెరికాకు ఎగుమతి చేసిన ఇంజినీరింగ్ వస్తువుల్లో 35.7 శాతం.. యూరోపియన్ యూనియన్‌కు చేసిన ఎగుమతుల్లో 46.1 శాతం, ఇతర దేశాలకు ఎగుమతుల్లో 35.9 శాతం వృద్ధి సాధ్యమైంది. అదే ఏడాది రసాయనాలు, సంబంధిత ఉత్పత్తులకు సంబంధించి అమెరికాకు ఎగుమతుల్లో వృద్ధి 24.1 శాతం, యూరోపియన్ యూనియన్‌కు ఎగుమతుల్లో 24.2 శాతం, ఇతర దేశాలకు సంబంధించి 16.7 శాతం వృద్ధి నమోదైంది.

పలు పరిశ్రమల తోడ్పాటు

టెక్స్‌టైల్ పరిశ్రమ 52 బిలియన్ డాలర్ల మార్కెట్ విలువ కలిగి... మొత్తం తయారీరంగ ఉత్పత్తుల విలువలో 26 శాతం ఆక్రమించింది. పారిశ్రామిక ఉత్పత్తిలో 20 శాతం వాటా పొందిన టెక్స్‌టైల్ రంగం.. పారిశ్రామిక ఉద్యోగితలో 18 శాతం ఉపాధిని అందిస్తోంది. మొత్తం ఎగుమతుల రాబడిలో ఈ పరి శ్రమ వాటా 15 శాతం. కాగా, జీడీపీలో 4 శాతం వాటా కలిగి ఉంది. 2012 నాటికి 115 బిలియన్ డాలర్ల మార్కెట్ విలువను పొందే సామర్థ్యం ఉంది. దీనిద్వారా ప్రత్యక్షంగా 35 మిలియన్ల మందికి... పరోక్షంగా సుమారు 50 మిలియన్ల మందికి ఉపాధి లభిస్తోంది. 2007-12 మధ్యలో అదనంగా 12 మిలియన్ల ఉపాధి అవకాశాలు (ప్రత్యక్ష ఉపాధి 5 మిలియన్లు పరోక్షంగా 7 మిలియన్లు) అందిస్తుందని అంచనా. మరోవైపు దేశంలో సిమెంటు ఉత్పత్తికి డిమాండ్ పెరిగింది. ప్రపంచంలో సిమెంట్ ఉత్పత్తిలో మనదేశం రెండో స్థానంలో ఉంది. 2009-10 నాటికి సిమెంట్ పరిశ్రమ 111 మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్యాన్ని అదనంగా సాధిస్తుందని అంచనా. 2005-06లో ఈ పరిశ్రమ అవస్థాపిత సామర్థ్యం 157 మిలియన్ టన్నులు, కాగా, భారీ కర్మాగారాల వాటా 93 శాతం. దేశంలోని 125 భారీ పరిశ్ర మలను 54 కంపెనీలు నిర్వహిస్తున్నాయి. ప్రతి టన్ను సిమెంటుకు రూ. 3,500 మూలధన పెట్టుబడి అవసరమవు తోంది..

అనూహ్యం.. ఆటోమొబైల్ వృద్ధి

1991 తర్వాత మనదేశంలో ఆటోమొబైల్ పరిశ్రమ వార్షిక వృద్ధి 17 శాతం. ఈ పరిశ్రమ మొత్తం టర్నోవర్ రూ. 1,65,000 కోట్లు. కాగా, మొత్తం పెట్టుబడి రూ. 50,000 కోట్లు. ఈ పరిశ్రమ ప్రత్యక్షంగా, పరోక్షంగా 1.31 కోట్ల మందికి ఉపాధి అందించింది. పరోక్ష పన్నుల రాబడిలో ఈ రంగం వాటా 17 శాతం. 1991లో మొత్తం 2 మిలియన్ వాహనాలు ఉత్పత్తవగా 2006లో ఈ సంఖ్య 9.7 మిలియన్లు. గత ఐదేళ్లలో అన్ని వాహనాల ఉత్పత్తిలో 16 శాతం వృద్ధి నమోదైంది. 2016 నాటికి ఈ రంగం వాటా జీడీపీలో 10 నుంచి 11 శాతం వరకు ఉంటుందని అంచనా. మరోవైపు దేశ జీడీపీ 650 బిలియన్ డాలర్ల నుంచి 2010 నాటికి 950 బిలియన్ల డాలర్లకు... 2016 నాటికి 1390 బిలియన్ డాలర్లకు పెరుగుతుందని అంచనా. ఇందులో ఆటోమొబైల్ రంగం వాటా 34 బిలియన్ డాలర్ల నుంచి 2010 నాటికి 69 బిలియన్లకు 2016 నాటికి 145 బిలియన్ డాలర్లకు పెరగగలదని అంచనా. 1992లో మనదేశం 14.33 మిలియన్ టన్నుల Finished carbon steel ఉత్పత్తి జరిగింది. ఇందులో Pig Iron ఉత్పత్తి 1.59 మిలియన్ టన్నులు. తర్వాత కాలంలో వీటి ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. 2008లో Finished steel ఉత్పత్తి 46.57 మిలియన్ టన్నులకు Pig Iron ఉత్పత్తి 4.393 మిలియన్ టన్నులకు పెరిగింది. 1992లో Finished steel మొత్తం వినియోగం దేశంలో 14.84 మిలియన్ టన్నులు కాగా, 2008లో 43.92 మిలియన్ టన్నులుగా ఉంటుందని అంచనా. ప్రపంచంలో ప్రస్తుతం స్టీల్ ఉత్పత్తిలో మనది ఐదోస్థానం. ఈ పరిశ్రమలో మార్కెట్ మూలధనం 102 బిలియన్ డాలర్లు. కాగా ప్రత్యక్షంగా 0.5 మిలియన్లు, పరోక్షంగా 1.5 మిలియన్ల మంది ఉపాధి పొందుతున్నారు. వీటితోపాటు అభివృద్ధి పథంలో నడుస్తున్న మరో పరిశ్రమ ఫార్మాస్యూటికల్. పరిమాణంలో 4వ స్థానాన్ని, ప్రపంచ

ఫార్మా మార్కెట్ విలువలో 13వ స్థానాన్ని మనదేశం పొందింది. ఈ పరిశ్రమ విలువ 4.5 బిలియన్ డాలర్లు. వార్షిక వృద్ధి 8 నుంచి 9 శాతంగా ఉంది. ఈ పరిశ్రమలో ప్రస్తుతం 20,000 రిజిష్టర్డ్ యూనిట్లు ఉన్నాయి. మొత్తం ఫార్మా మార్కెట్‌లో 70 శాతాన్ని దాదాపు 250 కంపెనీలు ఆక్రమించాయి.

రాష్ట్రాల నుంచి ఎగుమతులను ప్రోత్సహించడానికి "Development of Export Infrastructure and Allied activities' పథకం కింద కేంద్రప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు 2005-06లో రూ. 400 కోట్ల ఆర్థిక సహాయం అందించింది. దానిని 2006-07లో రూ. 440 కోట్లకు పెంచింది.

ప్రాక్టీస్ బిట్స్

1) 2006-07లో మనదేశ ఎగుమతుల్లో ప్రధానమైంది
   - ఇంజినీరింగ్ వస్తువులు
2) 2006-07లో మొత్తం ఎగుమతుల్లో ప్రాథమిక ఉత్పత్తుల వాటా
   - 15.1 శాతం
3) జీడీపీలో టెక్స్‌టైల్ పరిశ్రమ వాటా
   - 4 శాతం
4) ఇండియన్ సిమెంట్ కంపెనీ ఎప్పుడు, ఎక్కడ ప్రారంభించారు?
   -1914, గుజరాత్‌లోని పోర్‌బందర్‌లో
5) విశ్వేశ్వరయ్య ఇనుము ఉక్కు కర్మాగారం ఎక్కడ ఏర్పాటైంది?
   -కర్ణాటకలోని భద్రావతి